క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, ఇతర మరమ్మతు పనుల కారణంగా శుక్రవారం ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని ఈ కింది ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్‌రావు తెలిపారు.

- ఉ. 9 నుంచి మ. 11 గంటల వరకు...పద్మావతీ కాలేజీ, లక్ష్మీనగర్, వినయ్‌నగర్, రిలయన్స్ ఫ్రెష్, భారత్ గార్డెన్, విజయ డయాగ్నస్టిక్ సెంటర్, మనోహర నగర్ పరిసర ప్రాంతాలు
- ఉ. 11 నుంచి మ.ఒంటి గంట వరకు... లక్ష్మీనగర్ క్రాస్‌రోడ్, రామాలయం, వాణీనగర్, పటేలమ్మ మడిగ, ఆనంద్ బిస్కట్ ఫ్యాక్టరీ, ధోబీఘాట్ రోడ్ పరిసరాలు.
- మ. 3 నుంచి సా. 5 గంటల వరకు... ఆర్‌టీఏ ఆఫీస్, ఈస్ట్ అండ్ వెస్ట్ ప్రశాంత్‌నగర్, శ్రీపురం కమ్యూనిటీహాల్, నాగ ఆలయం పరిసర ప్రాంతాలు.

డూప్లికేట్ ఉత్పత్తులు విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

మలక్‌పేట: డూప్లికేట్ ఉత్పత్తులు విక్రయిస్తున్న స్పోర్ట్‌వేర్ షాపు నిర్వాహకుడిపై కేసు నమోదైన ఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాలు.. దిల్‌సుఖ్‌నగర్‌లోని ఎఫ్‌ఎఫ్‌టీఐ స్పోర్ట్స్ వేర్ దుకాణంలో లాకోస్ట్ అండ్ గ్రాంట్ బ్రాండ్‌కు చెందిన డూప్లికేట్ ఉత్పత్తులు విక్రయిస్తున్నారని సయ్యద్ మహమ్మద్ ఫరూక్ అనే వ్యక్తి గురువారం మలక్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ జయంత్ సిబ్బందితో కలిసి దుకాణంలో తనిఖీ చేపట్టారు. ఏడు బండిళ్ల డూప్లికేట్ ఉత్పత్తులను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. నిర్వాహకుడు శివను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

అనాథలకు చీరల పంపిణీ

వనస్థలిపురం: వనస్థలిపురం ప్రశాంత్‌నగర్‌లోని శ్రీ కనకదుర్గ దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం యాదాద్రి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని అమ్మ నాన్న అనాథల పుణ్యక్షేత్రంలో 300 చీరలను అనాథలకు అందజేశారు. అమ్మవారికి భక్తులు కానుకగా ఇచ్చిన చీరలను అనాథలకు అందజేశామని ఆలయ చైర్మన్ సంరెడ్డి భుజంగరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి పిన్నింటి పద్మారెడ్డి, కోశాధికారి కొండా వీరేశం, కన్వీనర్ రామస్వామి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రాజేశ్వరరావుకు అభినందనలు

సైదాబాద్: తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన డి.రాజేశ్వరరావును పలువురు క్రిస్టియన్లు అభినందించారు. గురువారం ఆయన్ను నివాసంలో కలుసుకున్న నల్లిమొల్లి మోజెస్, రెవరెండ్ ఆర్.భీముడునాయక్, మేడి ఆనంద్‌లు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గవర్నర్ కోటాలో మూడుసార్లు ఎమ్మెల్సీగా సేవలందించిన రాజేశ్వరరావు ఎమ్మెల్సీ పదవికే వన్నె తెచ్చారన్నారు. రాజేశ్వరరావును క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బిషప్ దుర్గం ప్రభాకర్, బీఎస్ రూబెన్, పాస్టర్లు భాస్కర్, సువర్ణరాజు, జర్జీ ముల్లర్, బ్రదర్ శేఖర్, బ్రదర్ ఆనంద్ పాల్గొన్నారు.

కుట్టు మిషన్ అందజేత

నాగోలు: ప్రతి పేద కుటుంబానికి ఐవీఎఫ్ అండగా ఉంటుందని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్(ఐవీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, టూరిజం అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. భర్త చనిపోయి ఇద్దరు పిల్లలతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న తాడిశెట్టి శ్రీవాణి అనే మహిళలకు గురువారం ఐవీఎఫ్ ఆధ్వర్యంలో ఆయన చేతుల మీదుగా కుట్టు మిషన్ అందజేశారు.

తీజ్‌ను అధికారిక పండుగగా ప్రకటించాలి: రాంరెడ్డి

లింగోజిగూడ: గిరిజనుల సమస్యలను పరిష్కరించడంలో సీఎం కేసీఆర్ విఫలమయ్యాడని, తీజ్‌ను ప్రభుత్వం అధికారిక పండుగగా గుర్తించాలని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి డిమాండ్ చేశారు. డివిజన్ పరిధిలోని గ్రీన్ పార్క్ కాలనీ సమీపంలో సేవాలాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన తీజ్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గిరిజన సంక్షేమమే కాంగ్రెస్ విధానమని, తాము అధికారంలోకి వచ్చాక వారి అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తామని రాంరెడ్డి అన్నారు. కార్యక్రమంలో నాయకులు కిషన్‌నాయక్, రమేష్‌నాయక్, శ్రీపాల్‌రెడ్డి, నరసింహయాదవ్, వేణుయాదవ్, మంజులరెడ్డి, దీప్లనాయక్, గణేష్‌నాయక్, బద్రినాయక్, రాజు, రాంబాబు పాల్గొన్నారు.



తీజ్ వేడుకల్లో పాల్గొన్న మల్‌రెడ్డి రాంరెడ్డి

దుమ్ముతో దమ్ము

- వర్షాలకు దెబ్బతిన్న రహదారులు
- వరద నీటితో పేరుకున్న మట్టి
- అది ఎండి ఎగసివస్తున్న దుమ్ము, ధూళి
- కంటి, శ్వాస సంబంధ వ్యాధులతో ప్రజల ఇక్కట్లు



విజయవాడ జాతీయ రహదారిపై ఆటోనగర్ వద్ద ఎగసి పడుతున్న దుమ్ము

వనస్థలిపురం: ఏరోడ్డు చూసినా ఏమున్నది గర్వకారణం... సమస్తం దుమ్ము, ధూళిమయం... అన్నట్టు తయారైంది మహానగరంలోని రోడ్ల పరిస్థితి. ఇటీవల కురిసిన వర్షాలతో తడిసిముద్దయిన నగరం, ప్రస్తుతం దుమ్ము, ధూళి మధ్య కొట్టుమిట్టాడుతోంది. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతు చేపట్టకపోవడంతో విపరీతంగా దుమ్ము,ధూళి రేగుతోంది. ఫలితంగా ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తమకు తెలియకుండానే అనారోగ్యం బారిన పడుతున్నారు

- రద నీటితో కొట్టుకువచ్చిన మట్టి ఎండిపోయి వాహనాలు వెళ్లే సమయంలో ఎగిసిపడుతోంది. దాంతో జనం శ్వాసకోశ వ్యాధులకు, కంటి సమస్యలకు గురవుతున్నారు. దుమ్ము వల్ల తెల్లగుడ్డు ఎర్రబడుతోంది. కంకర రాళ్లతో ఏర్పడే పొడి (డస్ట్), ఇసుక రేణువుల్లోని సిలికా అనే పదార్థం నల్లగుడ్డుపై తీవ్ర ప్రభావం చూపుతోంది.
- ఈ రెండు రకాలే కాకుండా, పేడ, చెత్తా చెదారాలు, రోడ్డుపై మురుగునీరు పారి ఆరిపోయాక ఉత్పన్నమయ్యే దుమ్ముతో కంటికి ఇన్‌ఫెక్షన్ల వస్తోందని కంటి వైద్యులు చెపుతున్నారు. ఇన్‌ఫెక్షన్ పెరిగిపోయి కార్నియల్ అల్సర్, శ్వాసకోశ వ్యాధులు, కళ్లు ఎరుపెక్కడం, నీళ్లు కారుతుండటం వంటి రుగ్మతలు వస్తాయంటున్నారు.
- వీటిని నిర్లక్ష్యం చేస్తే చాలా ప్రమాదకరమని వైద్యులు చెపుతున్నారు. ఈ తరహా రుగ్మతలతో బాధపడుతున్నవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని వారు చెబుతున్నారు. నగర రోడ్లు చిమ్ముతున్న దుమ్ములో సిలికా, కార్బన్ పార్టికల్స్ అధికంగా ఉంటున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి...

- 'నివారణ చికిత్స కన్నా మేలు' అన్నట్లు నగర రోడ్లు విరజిమ్ముతున్న దుమ్ము, ధూళి నుంచి బయటపడేందుకు ముందు జాగ్రత్తలే మేలని వైద్య నిపుణులు చెబుతున్నారు.

కళ్లు భద్రం...

- రోడ్లపై ప్రయాణించాక ముందుగా చన్నీటితో మొఖం కడుక్కోవాలి.
- కంట్లో దుమ్ము పడ్డప్పుడు చేతులతో నలుపుకోకూడదు. వెంటనే నీటితో కడగాలి.
- కన్ను ఎరుపెక్కితే అలక్ష్యం చేయకూడదు. వైద్యుల సూచనల మేరకు లూబ్రికెంట్ డ్రాప్స్ వేసుకోవాలి.
- కళ్లు మండటం ఇన్‌ఫెక్షన్‌కు సూచనలు. అప్పుడు డీ-కంజెసెంట్ డ్రాప్స్ వేసుకోవాలి.
- బైక్‌పై ప్రయాణించేవారు హెల్మెట్ గ్లాసను వినియోగించాలి.

శుభ్రత ముఖ్యం...

- దుమ్ము, ధూళి వల్ల డస్ట్‌ఎలర్జీ, శ్వాసకోశ వ్యాధులు ప్రబలుతున్నాయి. శుభ్రత, ముందు జాగ్రత్తలతోనే వీటిని నిరోధించవచ్చని వైద్యులు అంటున్నారు.
- బయట తిరిగి ఇళ్లకు వెళ్లగానే స్నానం చేసి, దుస్తులు మార్చుకోవడం మంచిది. అదే దుస్తులతో ఉంటే ధూళికణాలతో ఇబ్బందులు ఎదురవుతాయి.
- రోడ్లపై వెదజల్లే దుమ్ములో కార్బన్, సిలికా, ఇతరత్రా మూలకాలు అధిక స్థాయిలో ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో ద్విచక్రవాహనదారులు ముక్కుకు కర్చీఫ్ కట్టుకోవడం మంచిది. లేదంటే మాస్కులు ధరించవచ్చు.
- శ్వాసకోశాల్లో చేరే దుమ్మును తొలగించడం కష్టం. ఇది దుష్పరిణామాలకు దారితీసేలోపే.. యోగాలోని ప్రాణాయామం అలవాటు చేసుకోవడం మంచిది.
- కంటినొప్పి తీవ్రంగా ఉన్నా... కళ్లలోంచి నీళ్లు కారుతున్నా వైద్యుడిని సంప్రదించడం మంచిది.

శ్వాసకోశ వ్యాధులు ప్రబలుతున్నాయి

దుమ్ము, ధూళి వల్ల ఆస్తమా, సైనసైటిస్, ఎలర్జీ, శ్వాసకోశ వ్యాధులు ప్రబలుతున్నాయి. దగ్గు, జలుబు, జ్వరం, ఉబ్బసం, ఆయాసం వచ్చే అవకాశాలున్నాయి. ఆస్తమా ఉన్నవారికి దుమ్ము వల్ల వ్యాధి మరింత ఎక్కువ అవుతుంది. ఇటువంటి కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి.

డాక్టర్ రాజు,
వనస్థలిపురం ఏరియా ఆసుపత్రి

డ్రెయిన్ పనులు పూర్తికాకపోవడంతోనే సమస్యలు



గడ్డిఅన్నారంలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో పాల్గొన్న సామరంగారెడ్డి, కార్పొరేటర్ ప్రేమ్

చైతన్యపురి: బాక్స్ డ్రెయిన్ పనులు సకాలంలో పూర్తికాక పోవటం వల్లే కాలనీల్లో వరద ముంపు సమస్య తలెత్తుతోందని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డితో కలిసి కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా సామ మాట్లాడుతూ, సరూర్‌నగర్ చెరువు నుంచి వరదనీరు సాఫీగా వెళ్లేందుకు బాక్స్ డ్రెయిన్ పనులను సంవత్సరం క్రితం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అట్టహాసంగా ప్రారంభించారని, ఇప్పటి వరకు పూర్తిస్థాయి నిర్మాణం చేయలేదని అని విమర్శించారు. నేతాజీనగర్ నుంచి సాయి గార్డెన్ వరకు, సరస్వతి నగర్, కృష్ణవేణినగర్, కమలానగర్ ప్రాంతాల్లో డ్రైనేజీలు పొంగి వరద ముంపు సమస్య అలాగే ఉందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రతిపక్ష కార్పొరేటర్లకు ఎమ్మెల్యే, మున్సిపల్ అధికారులు సహకరించడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో మోసపూరిత బీఆర్‌ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో దాసరి జయప్రకాష్, ఆనంద్, శ్రీధర్‌రెడ్డి, శ్రవణ్‌గౌడ్, రాంరెడ్డి, బండి నిర్మల, లక్ష్మీప్రసాద్, రాజయలక్ష్మి పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తే సహించం: సీపీఐ



కార్యక్రమంలో మాట్లాడుతున్న రవీంద్రాచారి

హయత్‌నగర్: స్వాతంత్ర్యానికి పూర్వమే పోరాడి సాధించుకున్న పలు కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వ కారాయాలని చూస్తోందని, కార్మిక చట్టాల జోలికి వస్తే సహించేది లేదని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి, రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షుడు పానుగంటి పర్వతాలు అన్నారు. జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు క్విట్ ఇండియా స్ఫూర్తితో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం హయత్‌నగర్‌లో మహాపడావ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను మార్చి కార్మికులను బానిసలుగా మార్చే కుట్ర చేస్తోందని, కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించి కార్మికులను రోడ్డున పడేస్తోందని ఆరోపించారు. కార్మిక చట్టాలను రక్షించుకునేందుకు క్విట్ ఇండియా తరహాలో మరో ఉద్యమం చేస్తామన్నారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు హరిసింగ్ నాయక్, రమావత్ సక్రూనాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వెంకన్న, దోల రాములు పాల్గొన్నారు.

ఫొటో, ఆడియోగ్రాఫర్స్ సమస్యలను పరిష్కరిస్తాం



ప్రమాణ స్వీకారం అనంతరం యూనియన్ ప్రతినిధులు

హస్తినాపురం: ఫొటో గ్రాఫర్స్, ఆడియోగ్రాఫర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు యూనియన్ తమ బాధ్యతగా వ్యవహరిస్తుందని ఫొటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం హస్తినాపురంలో ఏర్పాటు చేసిన నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హుస్సేన్, రాపర్తి శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడు జగదీష్‌గౌడ్, నాగరాజు, చంద్రశేఖర్, నక్క సంజీవగౌడ్, విక్రం, రాజు, రామాచారి, రామస్వామిగౌడ్ పాల్గొన్నారు.

ప్రజలకు భరోసా ఇవ్వాలి: డీసీపీ



రికవరీ చేసిన సెల్‌ఫోన్లను బాధితులకు అందజేస్తున్న డీసీపీ సాయిశ్రీ

హస్తినాపురం: పోలీసులు ప్రజలకు మేం ఉన్నామన్న భరోసా ఇవ్వాల్సిన అవసరం ఉందని, అందుకోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎల్‌బీనగర్ జోన్ డీసీపీ బి. సాయిశ్రీ అన్నారు. గురువారం వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న 11 మంది బాధితులకు ఫోన్లను తిరిగి ఇచ్చారు. సాంకేతిక ఆధారాలు ఉపయోగించి ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. ఈ సందర్భంగా డీసీపీ సాయిశ్రీ మాట్లాడుతూ, సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు వాటిని రికవరీ చేసి ఇచ్చేందుకు ప్రతి పోలీసు నిబద్ధతతో పనిచేయాలని సూచించారు వనస్థలిపురం ఏసీపీ ఎస్. భీంరెడ్డి, సీఐ జలేందర్‌రెడ్డి, డీఐ వెంకట్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కమిషన్‌ను ఏర్పాటు చేయాలి



సదస్సులో పాల్గొన్న ఆర్యవైశ్య సంఘాల నాయకులు

లింగోజిగూడ: పేద ఆర్యవైశ్యుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఆర్యవైశ్య కమిషన్ సాధన కమిటీ జేఏసీ చైర్మన్ గౌరిశెట్టి మునీందర్ గుప్తా డిమాండ్ చేశారు. ఆర్యవైశ్య కమిషన్ సాధన కమిటీ ఆధ్వర్యంలో గురువారం కర్మన్‌ఘాట్‌లోని శ్రీ లక్ష్మి కన్వెన్షన్‌లో కమిషన్ ఏర్పాటుకు చేయాల్సిన కృషిపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మునీందర్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని ఇతర కులాలకు ఏర్పాటు చేసిన విధంగానే ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి రూ.వెయ్యి కోట్ల బడ్జెట్ కేటాయించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే ఆర్యవైశ్య కమిషన్ ఏర్పాటుకు ముందడుగు వేయకపోతే నిరహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బాలరాజు, ఎల్‌వీ కుమార్, శ్రీనివాస్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

కుర్మగూడలో 'మేరి మిట్టి.. మేరి దేశ్'



బి.మహేశ్వర్‌ను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

చంచల్‌గూడ: ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న మేరి మిట్టి.. మేరి దేశ్ కార్యక్రమాన్ని గురువారం కుర్మగూడ డివిజన్‌లో బీజేపీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సైనికులు, మాజీ పోలీసు సిబ్బందిని వారు సత్కరించారు. ఆర్మీ, పోలీసు శాఖల్లో విధులు నిర్వహించిన ప్రభాకర్‌రెడ్డి, డి.శివకుమార్, డి.గణేష్, టి.సునీల్, కె. రామారావు, కె.బాల్‌రాజ్‌యాదవ్, బి.మహేశ్వర్‌లను బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు సహదేవ్‌యాదవ్ ఆధ్వర్యంలో సన్మానించారు. విధుల్లో వారు ఎదుర్కొన్న సవాళ్లు, అనుభవాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బండ వెంకట్‌రెడ్డి, నాయకులు సుధీర్, మహేష్, శ్రీనాథ్, నిరంజన్‌యాదవ్, దశరథ లక్ష్మి, నాగరాజు, మోహన్ లడ్డు, శ్రీకాంత్, ప్రదీప్, అజయ్, ప్రేమ్, ప్రమోద్, శశి పాల్గొన్నారు.

ఘనంగా తోట మహేష్‌యాదవ్ జన్మదిన వేడుకలు



జన్మదిన వేడుకల్లో మొక్కలు నాటుతున్న మహేష్ యాదవ్, పాల్గొన్న ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా

చైతన్యపురి: బీఆర్‌ఎస్ పార్టీ చైతన్యపురి డివిజన్ అధ్యక్షుడు తోట మహేష్‌యాదవ్ పుట్టిన రోజు వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మహేష్‌యాదవ్‌తో కేక్ కట్ చేయించి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఫణిగిరి కాలనీలోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన మహేష్‌యాదవ్ భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం పార్కుల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కోతి నర్సిరెడ్డి, యాదగిరి ముదిరాజ్, జయశ్రీ, సుధాకర్, విజయ్‌కుమార్, ఆలయ చైర్మన్ శ్రీనివాస్‌నాయుడు, ఆకెళ్ల రాఘవేంద్ర, ప్రవీణ్, నరసింహారెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

సింగరేణిలో ఘనంగా తీజ్



తీజ్ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ శ్వేతామధుకర్‌రెడ్డి

సైదాబాద్: గిరిజనులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే తీజ్ వేడుకలు ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీలో అత్యంత ఘనంగా నిర్వహించారు. గురువారం గిరిజన మహిళలు సాంప్రదాయ దుస్తుల్లో మొలకల బుట్టలు నెత్తిన పెట్టుకొని యువత ఆటపాటలతో తోడురాగా సరూర్‌నగర్ చెరువు వరకు ఊరేగింపుగా సాగారు. కార్యక్రమంలో పాల్గొన్న జంగం శ్వేతామధుకర్‌రెడ్డి మాట్లాడుతూ, తండాలు గ్రామాలు వదిలి జీవనోపాధి కోసం నగరానికి వచ్చినా సింగరేణి కాలనీలోని గిరిజనులు తమ సంస్కృతీ సాంప్రదాయాలను నిష్ఠగా పాటించడం అభినందనీయమన్నారు.

సైదాబాద్ సమగ్రాభివృద్ధికి కృషి

సైదాబాద్: ప్రణాళికాబద్ధంగా సైదాబాద్ డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి తెలిపారు. గురువారం డివిజన్ పరిధిలోని పూజల బస్తీలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సైదాబాద్‌లోని కాలనీలు, బస్తీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. డివిజన్‌లోని ఆయా ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను స్థానికులు తరుచూ పర్యవేక్షిస్తుండాలని సూచించారు. జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, జగన్నాథం, భానుప్రకాష్ పాల్గొన్నారు.



మాజీ సైనికాధికారులను సత్కరించడం ఎంతో గౌరవప్రదం



మాజీ సైనికాధికారి వంశీధర్‌రెడ్డిని సత్కరిస్తున్న కార్పొరేటర్ శ్వేతామధుకర్‌రెడ్డి

సైదాబాద్: విధి నిర్వహణలో తమ ప్రాణాలను పణంగా పెట్టి దేశరక్షణ కోసం పోరాడిన మాజీ సైనికాధికారులను సత్కరించుకోవడం మనకు ఎంతో గౌరవప్రదమని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ ఆదేశాలకు అనుగుణంగా చేపట్టిన నా మట్టి-నా దేశం కార్యక్రమాన్ని గురువారం ఐఎస్‌సదన్‌లో నిర్వహించారు. డివిజన్ పరిధిలోని కోదండరాం నగర్‌లో నివసించే మాజీ సైనికాధికారి వంశీధర్‌రెడ్డిని కార్పొరేటర్ బీజేపీ నాయకులతో కలిసి సత్కరించారు. శాలువా కప్పి, పూలబొకేలు ఇచ్చి సన్మానించి మిఠాయిలు పంచి పెట్టారు. బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్ రెడ్డి, అధికార ప్రతినిధి వీరేంద్రబాబు యాదవ్, అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.


భరత్‌నగర్ డ్రైనేజీ సమస్య త్వరలో పరిష్కారం: ఎమ్మెల్యే



అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాగోలు: కొత్తపేట డివిజన్ భరత్‌నగర్‌లో డ్రైనేజీ సమస్య త్వరలో పరిష్కారమవుతుందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హామీఇచ్చారు.భరత్‌నగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారం కోసం గురువారం ఆయన తన క్యాంప్ కార్యాలయంలో కాలనీ వాసులు, వాటర్ వర్క్స్ అధికారులతో సమావేశమయ్యారు. గతంలో భరత్‌నగర్‌లో 450 ఎంఎం పైప్ లైన్ ఉందని, మళ్లీ అదే 450 ఎంఎం పైప్‌లైన్ మంజూరైందని, పైప్‌సైజ్‌ను పెంచాలని కోరారు. అనంతరం సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, గతంలో సరైన ఎత్తుపల్లాలు చూడకుండా పైప్‌లైన్ వేశారని, ఇప్పుడు అలా కాకుండా ప్రతీది సరిచూసి పనులు చేట్టాలని వాటర్ వర్క్స్ అధికారులకు సూచించారు. కాలనీలో చేపట్టే డ్రైన్ పనులలో ప్రతి 15 మీటర్లకు ఒక మ్యాన్‌హోల్ నిర్మించాలన్నారు. ఈ పనులు సకాలంలో పూర్తయితే కాలనీ వాసులకు డ్రైనేజీ సమస్య నుంచి విముక్తి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ సర్కిల్ 10-ఏ మేనేజర్ బలరాంరాజు, బీఆర్‌ఎస్ కొత్తపేట డివిజన్ అధ్యక్షుడు లింగాల రాహుల్ గౌడ్, నాయకులు మహేష్ రెడ్డి, షరీఫ్, వెంకటేశ్, బాలాజీ, మల్లేష్, నర్సింహ, రుక్కమ్మ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మామ, భర్త తరపు బంధువులు అవమానిస్తున్నారని గృహిణి ఆత్మహత్య



శశికళ (ఫైల్)

నాగోలు: మామ, భర్త తరపు బంధువులు తరచూ తనను అవమానిస్తున్నారని గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... సరూర్‌నగర్ కృష్ణానగర్ కాలనీ నివాసి విష్ణువర్ధన్‌రెడ్డి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. కొన్నేళ్ల క్రితం మియాపూర్, ఆల్విన్ కాలనీకి చెందిన శశికళ(33)తో వివాహమైంది. వీరికి కుమార్తె శ్రేయారెడ్డి(6)ఉంది. శశికళను మామ దేవేందర్‌రెడ్డి, భర్త తరపు బంధువులు ఉషారాణి, వందన, రాజశేఖర్ తరచూ అవమానిస్తున్నారని శశికళ తన తల్లి యానాం గౌరికుమారికి పలుమార్లు చెప్పి ఆవేదన వ్యక్తం చేసింది. ఇలా ఉండగా, విష్ణువర్ధన్‌రెడ్డి గురువారం ఉదయం శశికళ తల్లి గౌరీకుమారికి ఫోన్ చేసి తక్షణమే తమ ఇంటికి రమ్మన్నాడు. దీంతో ఆమెకు అనుమానం వచ్చి కుమార్తె ఇంటి పక్కన ఉండేవారికి ఫోన్ చేయగా, శశికళ చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందని చెప్పారు. వెంటనే బంధువులతో కలిసి ఆమె కృష్ణానగర్‌కు చేరుకొని కన్నీరు మున్నీరైంది. మామ, బంధువులు అవమానకరంగా ప్రవర్తించడంతోనే తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని, నిందితులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని గౌరీకుమారి ఎల్‌బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు.

ప్రారంభమైన మిషన్ ఇంద్రధనుష్

- వారం రోజుల పాటు పీహెచ్‌సీల్లో చిన్నారులకు టీకాలు
- తప్పకుండా వేయించాలని వైద్యుల సూచన

చాదర్‌ఘాట్: చిన్నారులలో రోగనిరోధక వ్యవస్థ మెరుగుపడి వ్యాధులను నివారించడానికి ప్రభుత్వం ఇంద్రధనుష్ పేరిట ఈనెల 12 వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా మలక్‌పేట నియోజకవర్గ పరిధిలో ఉన్న 19 ప్రభుత్వ పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో టీకాలు వేసే కార్యక్రమం ప్రారంభమైంది. హైపటైటీస్, నిమోనియా, ధనుర్వాతం, టీబీ, మెదడు వాపు, పోలియో తదితర వ్యాధుల నివారణకు వైద్యారోగ్య శాఖ ప్రతినెలా ఐదేళ్లలోపు చిన్నారులకు టీకాలు వేస్తోంది. సమయానికి టీకాలు వేసుకోని చిన్నారులకు ఇంద్ర ధనుష్ కార్యక్రమం ద్వారా ఈనెల 9 నుంచి 12 వరకు టీకాలు వేస్తోంది. చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యం కోసం వారికి టీకాలు తప్పక వేయించాలని ఓల్డ్‌మలక్‌పేట యూపీహెచ్‌సీ డాక్టర్ జ్యోతి తెలిపారు. ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి ఈ టీకాలు వేయించుకోవాలన్నారు.

- ఇంద్రధనుష్ కార్యక్రమ ఉద్దేశం పలు కారణాల వల్ల సమయానికి టీకాలు వేయించుకోని చిన్నారులు భవిష్యత్‌లో ఇబ్బందులు పడకుండా ఉండటానికి ఈ కార్యక్రమంలో టీకాలు వేయించాలని తల్లిదండ్రులకు డాక్టర్లు సూచిస్తున్నారు.
- మిషన్ ఇంద్రధనుష్ పేరిట బీసీజీ పెంటా-1, పెంటా-సీ, బీసీవీ ఎంఆర్-1, ఎంఆర్-2 తదితర టీకాలు వేస్తారు.
- టీకా తీసుకునే తేదీకి ముందు తల్లిదండ్రులను అప్రమత్తం చేస్తూ మొబైల్‌ఫోన్‌కు మెసేజ్ పంపిస్తారు. దాని ద్వారా గర్భిణులు, చిన్నారులు సంపూర్ణమైన ఆరోగ్యం సాధ్యమవుతుందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.



మలక్‌పేటలోని యూపీహెచ్‌సీకి టీకా కోసం చిన్నారులను తీసుకొచ్చిన తల్లులు